క్లుప్తంగా

100 మంది విద్యార్థుల ఎంపిక

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల జాబితాను ప్రిన్సిపాల్ శ్రీదేవి విడుదల చేశారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం 100మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జాబితాను నోటీస్‌బోర్డులో ప్రదర్శించామని, ఎంపికైన వారు తమ టీసీ, ఇతర వివరాలతో జాయిన్ కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుఏఈ దుర్గప్రసాద్ సోమవారం తెలిపారు. మరమ్మతుల్లో భాగంగా శివ్వంపేట, పాంబండ, చిన్నగొట్టిముక్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోతులబోగూడ, ఉసిరికపల్లి, తిమ్మాపూర్, చిన్నగొట్టిముక్ల, చెన్నాపూర్, శివ్వంపేట టౌన్‌లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

పై చదువులకు సలహాలు


బహుమతులు అందజేస్తున్న జీఎంఆర్ ప్రతినిధులు

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నేచర్‌ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందించి పదో తరగతి పూర్తి చేసిన వారికి పైచదువుల కోసం సలహాలు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి సాయికిరణ్, నేచర్‌ఐకాన్ అధ్యక్షుడు స్వామితో పాటు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ, ఆరు ట్రాక్టర్లు సీజ్

చిన్నశంకరంపేట(మెదక్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీతోపాటు ఆరు ట్రాక్టర్‌లను సీజ్‌చేసినట్లు చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ యజమాని ఎండీ షాబొద్దీన్‌తో పాటు ఆరు ట్రాక్టర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

5లోగా పనులు చేయించాలి

డీఈఓ రాధాకిషన్

నర్సాపూర్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేయించాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో సివిల్ పనులపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరైన పాఠశాలల్లో అవసరమైన పనులన్నింటినీ జూన్ 5లోపు పూర్తి చేయించేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ బుచ్చానాయక్, పీఆర్ ఏఈ స్వామిదాస్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ వేదిక సేవలు

చేగుంట(తూప్రాన్): బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంక్షేమ వేదిక జిల్లా కన్వీనర్ పోరండ్ల వేణుగోపాలశర్మ అన్నారు. సోమవారం రాయితీ హెల్త్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఉచితవిద్య, వైద్యం కోసం సంక్షేమ వేదిక కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక కార్యదర్శి బాలశ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటకిషన్‌రావు, సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, వేదవ్యాస్, లింగమూర్తి, సర్వేశ్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఎన్నో ఏళ్లుగా దొడ్డిజాగాలుగా ఉన్న తమ భూములను కొంత మంది అన్యాయంగా ఆక్రమిస్తున్నారని గ్రామ మహిళలు ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సోమవారం మనోహరాబాద్ మండలంలోని కోండాపూర్ నివాస గృహాలకు ఆనుకుని ఉన్న 144 సర్వే నంబర్‌లో కొంత మంది ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులను గ్రామ మహిళలు అడ్డుకున్నారు. నాయకులు, అధికారులు పట్టించుకుని తమకు న్యాయం చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


నిర్మాణాన్ని అడ్డుకుంటున్న మహిళలు

విత్తనాల బిల్లు భద్రపరుచుకోవాలి

జిల్లావ్యాప్తంగా విత్తనాల కొనుగోలుపై వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. సోమవారం గ్రామాలు, మండల కేంద్రాల్లో సదస్సులు, సభలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

- లూజ్ విత్తనాలు తీసుకోవద్దు
- ఏడీఏ పుణ్యవతి


గుండ్రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు విత్తనాలు కొనుగోలు చేయగానే బిల్లు తీసుకోవడంతోపాటు విత్తన ప్యాకెట్‌ను పంటపూర్తి అయ్యేవరకు జాగ్రత్త చేసుకోవాలని ఏడీఏ పుణ్యవతి తెలిపారు. సదాశివపల్లిలో ఆమె మాట్లాడుతూ గుర్తింపు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, లూజ్ విత్తనాలు తీసుకోవద్దని చెప్పారు. వెంకట్రావుపేటలో ఏఓ స్వప్న, బూరుగడ్డ, భుజిరంపేట, మనంతయపల్లి తండా, రాయిలాపూర్ గ్రామాలలో ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, దివ్యశ్రీ, బీటీఎం గౌతమి రైతులకు అవగాహన కల్పించారు. ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని ఏడీఏ పుణ్యవతి తనిఖీ చేశారు. స్టాక్, ధరలపట్టిక పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు అమ్మకం, రైతుల వివరాలు రికార్డులో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఏఓ స్వప్న పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే కొనాలి..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని యశ్వంతరావ్‌పేట, ఆరెగూడెం, అందుగులపల్లి, బండపోసాన్‌పల్లి, హస్తాల్‌పూర్ గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఝాన్సీ, ఏఈఓలు సాయికుమార్, గౌతమి, వందన, ఉత్తమ్‌కుమార్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి సాధించేందుకు..

తూప్రాన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడి సాధించేందుకు విత్తన సేకరణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని గుండ్రెడ్డిపల్లి, నాగులపల్లి గ్రామాల్లో రైతులకు ఏఓ గంగుమల్లు, ఏఈఓ సింధు అవగాహన సదస్సులు నిర్వహించారు.

రశీదులు తప్పని సరి

పాపన్నపేట(మెదక్): రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని ఏఈఓ నాగం క్రిష్ణ సూచించారు. పాపన్నపేట,అమ్రియాతండా,ముద్దాపురం,అన్నారం, అబ్లాపూర్, ఎంకెపల్లి, సీతానగర్, కుర్తివాడ, గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. బీటీ-2 విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. సందేహాలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏఈఓలు జనార్దన్, అభిలాష్, ఆసిఫ్, రజిత ఉన్నారు.


కౌడిపల్లి: సదాశివపల్లిలోఅవగాహన కల్పిస్తున్న ఏడీఏ పుణ్యవతి


ఆరెగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఏఓ ఝాన్సీ, ఏఈఓ రేవతి

జాగ్రత్తలు అవసరం..

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు ఎరువులు, విత్తనాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. చిట్కుల్, శీలాంపల్లి, సోమక్కపేట్ గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు, ప్యాకింగ్ లేని విత్తనాలు అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రమ్య, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు

చేగుంట(తూప్రాన్): మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ ఉల్లితిమ్మాయిపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలులో జాగ్రతలు పాటించాలని ఏఓ సూచించారు. ఏఈఓలు ప్రవీణ్, అశోక్‌రెడ్డి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయనిర్మల

రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

పెద్దశంకరంపేట(మెదక్): కె.వెంకటాపూర్, బద్దారం, కమలాపూర్, సంగారెడ్డిపేట, జూకల్ తదితర గ్రామాలలో ఏఈఓలు స్వాతి, మమత, సుభాస్ కిరణ్ రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. సేంద్రీయ ఎరువుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

విత్తనాలుకొనే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ విజయనిర్మల అన్నారు. మాచవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మంచి దిగుబడి రాకపోయినా, విత్తనాల వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే సదరు కంపెనీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందుకోసం రశీదును భద్రపర్చుకోవాలన్నారు. ఏఓ శ్రీనివాస్, ఏఈవో రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.


పాపన్నపేటలో...


చిట్కుల్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి


చేగుంట(తూప్రాన్): రైతులకు సూచనలిస్తున్న ఏఓ హరిప్రసాద్


చేగుంట(తూప్రాన్): సంగారెడ్డిపేటలో..


బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

వీరభద్రుడికి ఘనంగా బండ్ల ఊరేగింపు

కొనసాగుతున్న బొడ్మట్‌పల్లి జాతర

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీసమేత వీరభద్రుడి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బండ్ల ఊరేగింపు వైభవంగా సాగింది. బండ్లను రంగురంగులతో అలంకరించి యువకులు డప్పుచప్పుళ్ల మధ్య ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ ఉత్సవాల్లో పాల్గొని నృత్యాలుచేసి అందరినీ ఉత్సాహపరిచారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మురళీ తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉత్సవంలో భాగంగా మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ తెలిపారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు నిమ్మవాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలో శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం 35వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఒగ్గుపూజారి రాములు బృందం ఆధ్వర్యంలో గంగపటం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజులు విన్యాసం ఆకట్టుకుంది. ఆలయ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ ఎల్లం, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎల్లమ్మదేవి ఆలయం వద్ద భక్తులు

విమర్శిస్తే పెద్ద నాయకులు కాలేరు

- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్

నర్సాపూర్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి లాంటి పెద్ద నాయకులపై ఆరోపణలు, విమర్శలుచేస్తే పెద్ద నాయకులు కాలేరని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్‌కు చెందిన డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కేసీఆర్, హరీశ్‌రావు, సునీతారెడ్డిలపై చేసిన ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చంద్రాగౌడ్ తెలిపారు. రైతులు, మహిళలు, యువతను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, శేఖర్, భిక్షపతి, రాంచందర్, సత్యంగౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మోడ్రన్ ధోబిఘాట్ నిర్మించాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న రజక నాయకులు

తూప్రాన్: పట్టణంలోని రజకుల సంక్షేమం కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో మోడ్రన్ దోబి ఘాట్ నిర్మించాలని కోరుతూ రజక సంఘం నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ మోడ్రన్ దోభిఘాట్‌ను పట్టణ పరిధిలోని రావెల్లి గ్రామ శివారు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణానికి దూరంగా ఉండడంతో ఉపయోగంలేదని వాపోయారు. పట్టణ కేంద్రంలో 10 గుంటల భూమి కేటాయించిన విషయంను గుర్తు చేశారు. అక్కడే మరో 10 గుంటలు భూమిని కేటాయించి ధోబిఘాట్ నిర్మించాలని రజక సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో అంజయ్య, ధనరాజ్, యాదగిరి, కుమార్, వెంకటేశ్, ఎల్లం, శ్రీశైలం, మహంకాళి నర్సింహులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

చర్యలు తీసుకోవాలని డిమాండ్

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కూలీలు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. మండల పరిధి అల్లీపూర్ గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసిన వారికి కాకుండా ఇతరులకు డబ్బులు జమకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా కల్పించుకుని కూలీలకు నచ్చచెప్పారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సాపూర్ రూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని మూసాపేట-దౌల్తాబాద్ రోడ్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట గ్రామానికి చెందిన కాసాల లింగులు బైక్‌పై దౌల్తాబాద్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీ కొట్టింది. దీంతో లింగులకు తీవ్రగాయాలు కాగా మరో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

వృద్ధురాలు అదృశ్యం



శివ్వంపేట(నర్సాపూర్): వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు జాలిగామ లక్ష్మి ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఆమె కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పనులను పరిశీలించిన డీపీఓ

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలోని డీఎల్‌పీఓ సతీశ్‌కుమార్ పల్లె ప్రకృతి పనులను పరిశీలించారు. నందిగామ గ్రామంలో పంచాయితీ అసెట్స్ వెరిఫికేషన్‌లో భాగంగా హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- జెడ్పీ సీఈఓ ఎల్లయ్య


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

వెల్దుర్తి(తూప్రాన్): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ రంగాచార్యులుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఈజీఎస్ నర్సరీ నిర్వహణ, హరితహారంలో నాటిన మొక్కల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ విఘ్నేశ్వర్, కార్యాలయ సీనియర్ సహాయకుడు ఆనంద్, జూనియర్ సహాయకుడు శైలేందర్, ఏపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో విత్తనాల పరిశీలన


మనోహరాబాద్: విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ స్రవంతి

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని పలు విత్తనాల పరిశ్రమల్లో వ్యవసాయ అధికారి స్రవంతి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. పరిశ్రమల నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పలు గ్రామాల్లో విత్తనాల కనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓతో పాటు ఏఈఓలు నరేందర్, సచిన్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో విత్తనాలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో టీఎస్ సీడ్స్‌తో పాటు ఇతర రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సొసైటీ సీనియర్ డైరెక్టర్ నర్సింహచారి తెలిపారు. టీఎస్ సీడ్ 25కిలోల బస్తాతోపాటు ఇతర 12కిలోల వద్ద విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విత్తనాల కోసం అధికసంఖ్యలో రైతులు

- అగ్రోస్ కేంద్రం వద్ద తోపులాట



విత్తనాల కోసం వచ్చిన రైతులు

అల్లాదుర్గం(మెదక్): ఖరీఫ్ సీజన్ ప్రాంభంకాక ముందే రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ముందుగానే వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచించడంతో రైతులు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయాధికారులు అంచనా వేయకుండానే ఒకేచోట మండలానికి చెందిన రైతులకు జీలుగ విత్తనాలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో విత్తనాల కోసం రైతులు ఎగబడ్డారు. ఈ ఘటన అల్లాదుర్గంలో సోమవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలోని అగ్రోస్ కేంద్రంలో విత్తనాలు అమ్మకాలు చేపట్టారు. అయితే విత్తనాలు తక్కువగా రావడం వల్ల ఒక్కో రైతుకు రెండు బస్తాలే ఇవ్వాలని వ్యవసాయాధికారులు ఆదేశించారు. దీంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. 16 గ్రామ పంచాయతీలకు ఒకేచోట విత్తనాలు విక్రయించడంతో ఈ పరస్థితి నెలకొందని రైతులు ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనుగోలు పత్రం ఇవ్వడంలేదు..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, సొసైటీ డైరక్టర్ ఇష్టానుసారం కొనుగోళ్లు జరుగుతున్నాయని చండూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ ముసాద్దీక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీసం తాగునీటి సౌకర్యం లేదన్నారు. తూకం వేసిన ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్లు సైతం లేవని, రైతులు అమ్మిన ధాన్యానికి కొనుగోలు పత్రం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ సమస్యలపై తహసీల్దార్ చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులు భూమయ్య, మల్లారెడ్డి, లక్ష్మీకాంతం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొనుగోలు కేంద్రాలు పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మిగిలిపోయిన ధాన్యం రైస్‌మిల్‌లకు వెంటనే తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. అంబాజిపేట గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో 90 శాతం ధాన్యం రైస్ మిల్లులకు చేరిందన్నారు. ఎక్కడైనా లారీలు రాక ధాన్యం రైస్‌మిల్‌కు తరలించకుండా మిగిలిపోతే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

◆ వేధిస్తే ప్రతిఘటించాలి..

పాపన్నపేట(మెదక్): మహిళలను పూజించే దేశంలో వారిపై వేధింపులు జరిగడం దారుణమని, మహిళా శిశు సంక్షేమశాఖ కేస్ వర్కర్ స్వప్న, పారామెడికల్ లక్ష్మి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పాపన్నపేట మండలం ముద్దాపూర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వార్డ్ స్వచ్ఛంద సమన్వయంతో సఖికేంద్రం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ హింస, అత్యాచారాలు, మానసిక వేధింపులు, యాసిడ్ దాడులు, ఆర్థిక హింసకు గురైన మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఎక్కడ హింస జరిగినా ప్రతిఘటించాలన్నారు. మహిళలు ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొన్నపుడు 181, 112, 1098, 1930 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి పరమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గయ్య పాల్గొన్నారు.

◆ ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శివానందం సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన చకిలం కృష్ణ(43) ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్థాపం చెంది సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏటీఎం ధ్వంసం: ఇద్దరు అరెస్టు

తూప్రాన్: ఏటీఎంను ధ్వంసం చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివానందం సోమవారం తెలిపారు. మసాయిపేట మండల కేంద్రానికి చెందిన గోపి, శివ పట్టణంలోని సూర్య మెడికల్ పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేయడాన్ని పెట్రోలింగ్ పోలీసులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. ఏటీఎంలో ఎలాంటి చోరీ జరగలేదని, యంత్రం మాత్రం ధ్వంసమైందన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.